ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప
జిల్లా వార్తలు

5

గురువారం 29 ఫిబ్రవరి 2024

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పేరుతో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమానికి ఆర్భాటంగా శ్రీకారం చుట్టింది. కానీ అమలులో మాత్రం చతికల పడింది. రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఇంటింటి నుంచి చెత్త సేకరణ కోసం క్లాప్ పేరిట వాహనాలను ఏజెన్సీల ద్వారా ఏర్పాటు చేసి.. నిర్వహణ బాధ్యతలను సైతం వారికే అప్పగించింది. ఏజెన్సీలకు నెలనెల అద్దె డబ్బులు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకోసం నెలకు ఒక్కో వాహనా నికి రూ.66 వేలు చెల్లిస్తుంది. ఈ వాహనాలకు అద్దెలు చెల్లించడం కోసం మున్సిపాలిటీల్లో చెత్తపన్ను వసూళ్లకు శ్రీకారం చుట్టింది. అయితే కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో డిమాండుకు తగ్గట్టు చెత్త పన్ను (యూజర్ చార్జీలు) వసూలు కాకపోవడంతో సకాలంలో ఏజన్సీలకు మున్సిపాలిటీలు డబ్బులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనాల ఏజెన్సీలు వాటిని మెయింటనెన్స్ చేయడం భారంగా మారింది. క్లాప్ వాహనాలకు డీజల్ పట్టించలేకపోవడం, మరమ్మతులు చేయకపోవడం, డ్రైవర్లు, సూపర్‌వైజర్లకు జీతాలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. దీంతో క్లాప్ ఫ్లాప్ అయి మున్సిపాలిటీల్లో ఇంటింటి చెత్తసేకరణ పనులు కుంటుపడుతున్నాయి. పట్టణాల్లో ఎక్కడిచెత్త అక్కడ రోజుల తరబడి తరలించక కుళ్లి కంపు కొడుతోంది.



పేరుకుపోయిన చెత్త

క్లాప్.. ఫ్లాప్

- నెల రోజులుగా కదలని క్లాప్ ఆటోలు
- ఆగిపోయిన ఇంటింటి చెత్త సేకరణ
- పది నెలలుగా సిబ్బందికి జీతాలు చెల్లించని ఏజన్సీ
- మున్సిపాలిటీలో ఆగని చెత్తపన్ను వసూళ్లు
- క్లాప్ నిర్వహణను పట్టించుకోని జగన్ ప్రభుత్వం

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 28: జిల్లాలో కడప, ప్రొద్దుటూరు మున్సిపాలిటీల్లో 2022 మార్చి 1 నుంచి క్లాప్ వాహనాలు ఇంటింటా చెత్త సేకరణ పనులు ప్రారంభించాయి. కడప కార్పొరేషన్ పరిధిలో 100 క్లాప్ వాహనాలు, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో 40 అవసరం వుండగా 35 వాహనాలు అందుబాటులో వుండేవి. కడప మున్సిపాలిటీలో 100 వాహనాలకు నెలకు రూ.56,81,678 చెల్లిస్తుండగా... ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో 35 వాహనాలకు నెలకు రూ. 24,35,004 చెల్లిస్తున్నారు. అయితే గత పది నెలలుగా రెడ్డి ఏజన్సీకి చెందిన వారు ప్రొద్దుటూరులో క్లాప్ వాహన సిబ్బందికి జీతాలు చెలించకపోవడంతో క్లాప్ డ్రైవర్లు అనేకసార్లు అధికారులకు తమ గోడు వెలిబుచ్చారు. కానీ మున్సిపల్ అధికారులు మాత్రం తమకు సంబంధం లేదని.. తాము ఏజన్సీకి డబ్బులు చెల్లిస్తున్నామని చెబుతున్నారు. దీంతో క్లాప్ సిబ్బంది తాము జీతాలు లేకుండా విధులు నిర్వహించబోమని.. గత నెలరోజులుగా ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో ఆటోలు బంద్ చేశారు. దీంతో ఇంటింటి కసువు సేకరణ పనులు కుంటుపడుతున్నాయి.

చేతులెత్తేసిన ఏజన్సీ..

పట్టించుకోని అధికారులు

ప్రొద్దుటూరులో క్లాప్ వాహన సేవలను రెడ్డి ఏజన్సీ బంద్ చేసి చేతులెత్తేసింది. దీంతో వాహనాలన్నీ మున్సిపాలిటీలో ఎక్కడికక్కడ నిలిపివేశారు. ఇప్పటికే చాలా రోజులుగా మూలన వేయడంతో టైర్లు పాడైపోయాయి. వాహనాల డోర్లు తీసుకెళ్లారు. మరికొన్ని రోజులు ఇలాగే వదిలేస్తే.. అవి పూర్తిగా తుప్పు పట్టే పరిస్థితి ఉంది. ఇప్పటికే 16 వాహనాలు మరమ్మతుల కారణంగా మూలనపడ్డాయి. కేవలం 18 వాహనాలు మాత్రమే ఇంటింటి కసువు సేకరణ చేసేవి. అవి కూడా గత నెలరోజులుగా పూర్తిగా నిలిపేశారు. క్లాప్ సేవలు బంద్ అయినా మున్సిపల్, సచివాలయాల సిబ్బంది మాత్రం ఇంటింటికి వెళ్లి చెత్తపన్నులు మాత్రం వసూలు చేస్తున్నారని ప్రజలు చెబుతున్నారు.

వీధుల్లో పేరుకుపోతున్న చెత్త

ప్రతిరోజు మున్సిపాలిటీ నుంచి వంద మెట్రిక్ టన్నులకు పైగా చెత్త పోగవుతుంది. ఈ చెత్తను డంపింగ్ యార్డుకు తరలించడానికి క్లాప్ వాహనాలు లేకపోవడంతో వీధుల్లోని చెత్త పాయింట్లవద్ద చెత్త వేస్తున్నారు. ఈ చెత్తను రోజు తరలించలేని పరిస్థితి. రెండు మూడు రోజులకు ఒకసారి చెత్తను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. ఈ సమయంలో చెత్త రోడ్లపై, కాలువల్లో పడి ఆ పరిసరాలు దుర్భరంగా మారుతున్నాయి. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో మూడు పెద్ద కంపాక్టర్లు, మూడు చిన్న కంపాక్టర్లు, ఎనిమిది ట్రాక్టర్లు వున్నాయి. పుష్‌కాట్‌లు మాత్రం 180 వున్నప్పటికీ.. అందులో పనిచేస్తున్నవి మాత్రం 92 మాత్రమే అని శానిటరీ అధికారులు వెల్లడిస్తున్నారు.



క్లాప్ వాహనాలు సకాలంలో తరలించకపోవడంతో పేరుకుపోయిన వ్యర్థాలు

ప్రత్యామ్నాయ పద్ధతుల్లో చెత్త సేకరణ చేపడుతున్నాం..

ప్రొద్దుటూరులో నెల రోజులుగా క్లాప్ వాహనాలు నిలిపివేసిన మాట వాస్తవం. కానీ ఇంటింటి చెత్త సేకరణ పనులు మాత్రం పుష్‌కాట్‌లు, ట్రాక్టర్ల ద్వారా సేకరణ పనులు చేపడుతున్నాం. చెత్త తరలింపులో జాప్యం లేకుండా ఎక్కువ ట్రిప్పులు డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు తీసుకుంటాం. చెత్తను రోడ్లపై లేకుండా సకాలంలో వాటిని యార్డుకు తరలిస్తాం.

- రఘునాథరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు




రోడ్లపై చెడిపోయి నిలిచిపోయిన క్లాప్ వాహనాలు



టీబీ కాంప్లెక్స్‌లో పెట్టిన క్లాప్ వాహనాలు

జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిఘా నీడలో జరగనున్నాయి. మార్చి 1 నుంచి 20వతేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటికే విద్యార్థుల హాల్ టికెట్లను విడుదల చేశారు. పరీక్షల నిర్వహణ మొత్తం సీసీ కెమెరా నిఘాలో జరగనుంది. ఈసారి కూడా నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదన్న నిబంధన అమలు చేస్తున్నారు. ఇప్పటికే పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టరు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి... పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అన్నిశాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు.



నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

- మార్చి 1 నుంచి 20 వరకు..
- కేంద్రాలు 69, విద్యార్థులు 29942 మంది
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- పరీక్ష కేంద్రానికి అర్ధగంట ముందే చేరుకోవాలి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 28: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు 69 కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 29,942 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి 16177 మంది, ద్వితీయ సంవత్సరంలో 13765 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. 69 కేంద్రాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 15, ప్రైవేటు కళాశాలలు 44, సోషల్ వెల్ఫేర్ 4, ఎయిడెడ్ 4, హైస్కూలు ప్లస్ 1, మోడల్ స్కూలు 1 కళాశాలను ఏర్పాటు చేశారు. అలాగే చీఫ్ సూపరింటెండెంట్లు, అసిస్టెంటు సూపరింటెండెంట్లు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ లను నియమించారు.

నిమిషం ఆలస్యమైనా..

పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు అర్ధగంట ముందే చేరుకోవాల్సి ఉంటుంది. ఉదయం 8.30 నుంచి 9గంటల వరకు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని అధికారులు స్పష్టంగా చెబుతున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేయడంతో పాటు కేంద్రానికి సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసివేయనున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు తాగునీటి సౌకర్యం, అందుబాటులో వైద్య సిబ్బందిని కూడా ఏర్పాటు చేయనున్నారు.

సీసీ కెమెరా నిఘాలో..

పరీక్ష కేంద్రాల్లో బోర్డు అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఎదుటే ప్రశ్నాపత్రాలు విడుదల చేయడం, సమాధాన పత్రాలు సీల్ చేయడం వంటివి కొనసాగుతాయి. ప్రధానంగా విద్యార్థులు ఉదయం 9 గంటల నుంచి 12 వరకు పరీక్ష కేంద్రాల్లో ఉండాల్సిందే. పరీక్ష పూర్తయిన తరువాతే విద్యార్థులను బయటికి వదులుతారు.

ఏర్పాట్లు పూర్తి..



ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. మాస్ కాపియింగ్‌కు తావు లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోం. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి.

- బండి వెంకటసుబ్బయ్య, ఆర్ఐవో

మెగా చెక్కును రైతులకు అందజేస్తున్న కలెక్టర్ విజయరామరాజు



రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- జిల్లాలో రూ.42.29 కోట్లు రైతు భరోసా సాయం : కలెక్టర్

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 28: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని కలెక్టర్ విజయ రామరాజు అన్నారు. బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి కౌలు రైతులకు పీఎం కిసాన్ వైఎస్సార్ రైతు భరోసా 3వ విడత ఆర్థిక సాయంతో పాటు రబీ 2021-22 ఖరీఫ్‌కు సంబంధించి వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల రాయితీ మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమానికి కలెక్టరేట్ వీసీ హాలు నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ గణేష్‌కుమార్, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఓబుల కొండారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ ముఖ్య అతిథులతో కలిసి పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా ద్వారా 5వ ఏడాది 3వ విడతగా జిల్లాలో 2,10,625 మంది రైతులకు రూ.42.29 కోట్లతో పాటు సున్నా వడ్డీ కింద 41,828 మంది రైతులకు రూ.10.54 కోట్ల పంట రుణాల రాయితీ మొత్తాన్ని మెగా చెక్కు రూపంలో రైతులకు అందజేశారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలి

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 28: రానున్న సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని కలెక్టర్ విజయరామరాజు రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందనహాల్‌లో ఎన్నికల నియమావళి, సన్నద్ధతపై అన్ని రాజకీయపార్టీల ప్రతనిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, జేసీ గణేష్‌కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ అడిషనల్ ఎస్పీ సుధాకర్, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు ప్రతి అంశాన్ని సూక్ష్మ పరిశీలనతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్‌లు స్ప్రెడ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

మహాశివరాత్రి మహోత్సవాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులు, ఆలయ చైర్మన్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందనహాల్‌లో మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రముఖ శైవక్షేత్రాల్లో ఉత్సవ నిర్వహణ ఏర్పాట్లపై దేవదాయ, రెవెన్యూ, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా పెండ్లిమర్రి మండలం పొలతల మల్లీశ్వరస్వామి దేవస్థానంతో 13 శైవక్షేత్రాలకు భక్తులు లక్షలాదిగా హాజరవుతారని, వారికి ఎలాంటి లోటుపాట్లు రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆర్డీవోలు, ధర్మాదాయశాఖ డిప్యూటీ కమిషనరు శంకర్ బాలాజీ, ఈవోలు, చైర్మన్లు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సాహించాలి

జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహిక పారి శ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని కలెక్టర్ విజయరామరాజు డీఐఈపీసీ సభ్యులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో జిల్లా పారిశ్రామికవేత్తలు, ప్రోత్సాహిక కమిటీ (డీఐఈపీసీ)తో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామి వేత్తలకు ప్రోత్సాహం అందించేలా బ్యాంకర్లు సహకరించాలన్నారు. పరిశ్రమలశాఖ మేనేజరు జయలక్ష్మి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, జెడ్ఎం శ్రీనివాసమూర్తి, లీడ్ బ్యాంకు మేనేజరు దుర్గా ప్రసాద్, ఏపీఐఐసీ ప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు సీఎం జగనే అడ్డు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ

మైదుకూరు, ఫిబ్రవరి 28: ఎస్సీ వర్గీకరణే ధ్యేయంగా ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నా.. సీఎం జగన్ అడ్డు తగులుతున్నారని ఎమ్మార్పీయస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పేర్కొన్నారు. స్థానిక ఓ కల్యాణ మండపంలో మంగళవారం రాత్రి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నాయకులతో ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు మానికింది వెంకటేష్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ సాధన కోసం ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నామని, అసెంబ్లీ, పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించేలా పార్టీలు మద్దతు తెలపాలన్నారు. ఇందుకోసం ఎన్నోమార్లు పోరాటం చేస్తుంటే సీఎం జగన్ అడ్డుకోవడంతో పాటు అరెస్టులు కూడా చేయించారన్నారు. గత ఐదేళ్లలో ఎన్నో ఆర్థిక నేరాలు చేస్తూ కోర్టులో వాదించేందుకు న్యాయవాదులను పెట్టుకున్న ఆయన వర్గీకరణ కోసం వాదించేందుకు ఒక్క న్యాయవాదిని పెట్టుకోకపోవడం మాదిగలందరూ గమనించాలన్నారు. 1990లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తొలి వర్గీకరణకు న్యాయం చేశారని, ఫలితంగా 22 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ అనుకూలంగా వ్యవహరిస్తే.. జగన్ మాత్రం మాదిగలకు వ్యతిరేకంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. మాదిగ సోదరులంతా జగన్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మార్చి 9న చలో విజయవాడ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా ఎమ్మార్పీఎస్ అనుబంధసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం చాలా కాలంగా అమలు అవుతోంది. ప్రభుత్వాలు మారినా దీనిని ఇదే పేరుతో కొనసాగిస్తున్నాయి. అయితే వైసీపీ ప్రభుత్వం పౌష్టికాహారం పేరుతో ఈ పథకానికి 'జగనన్న గోరుముద్ద' అని పేరుపెట్టింది. వైసీపీ భజన బ్యాచ్ సైతం జగనన్న గోరుముద్దతో పౌష్టికాహారం తినడం ద్వారా విద్యార్థులు దృఢంగా తయారవుతున్నారని ప్రచారం చేసుకుంటున్నారు. క్షేత్ర స్థాయిలో మాత్రం ఇలా లేదు. దీనిపేరే గోరుముద్ద కావడంతో అన్నం ముద్దగా పెడితే సరిపోతుందనుకున్నారేమో ప్రభుత్వ పెద్దలు. ముద్దగా అయ్యే బియ్యాన్ని సరఫరా చేశారు. దీంతో పాఠశాలలో జగనన్న గోరుముద్దను విద్యార్థులు తినలేక ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్నారు. దీంతో జగనన్న గోరుముద్ద కాస్తా జగనన్న ఇంటిముద్దగా మారిందని పలువురు చమత్కరిస్తున్నారు.



పులిహోర అంటూ మంగళవారం విద్యార్థులకు వడ్డించిన అన్నం

జగనన్న 'ఇంటిముద్ద'

- కొత్త బియ్యం అనే సాకుతో ఇష్టానుసారం భోజనం
- ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 28: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులలో పౌష్టికాహార లోపం లేకుండా చూసేందుకు మధ్యాహ్న భోజనం పథకానికి జగనన్న గోరుముద్ద అని పేరు పెట్టింది. ఇంట్లో వండి తినిపించే అమ్మ గోరుముద్ద వంటి మధురమైన భోజనాన్ని అందిస్తామని గొప్పగా చెప్పింది. సోమవారం నుంచి శుక్రవారం వరకు అన్నం-పప్పుచారు, పులిహోర-టమోట పప్పు, కూరగాయల అన్నం-ఆలూ కుర్మా, కిచిడీ-టమోట చట్నీ, అన్నం-ఆకుకూర పప్పుతో పాటుగా గుడ్డు అందించాలని, శనివారం అన్నం-సాంబారు, స్వీట్ పొంగల్‌ను విద్యార్థులకు అందించాలని నిర్ణయించింది. ఈ మెనూ చూసిన వారు ఆహా అంటూ ఆనందించారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు కూడా జగనన్న గోరుముద్ద తినాలని ప్రభుత్వం సూచించింది. అయితే మంచి భోజనం అందిస్తారని సంబరపడ్డ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు భంగపాటు ఎదురైంది. రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం సంగటి ముద్దలు చేయడానికి తప్ప అన్నానికి పనికిరావని అంటున్నారు. దీంతో ముద్ద అయ్యే బియ్యంతో అన్నం వెరైటీలు చేయలేక నిర్వాహకులు తంటాలు పడుతున్నారు. ఎంత జాగ్రత్తగా చేసినా అన్నం ముద్ద అవుతుండటంతో తలలు పట్టుకుంటున్నారు. అయితే విద్యార్థులకు మంచి భోజనం పెట్టాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై ఉన్నతాధికారులు రుద్దుతున్నట్లు తెలుస్తోంది.



పులివెందుల జడ్పీ ఉన్నత పాఠశాల (రమణప్ప సత్రం)లో క్యారియర్లు తెచ్చుకుని తింటున్న విద్యార్థులు

ఇంటి నుంచి క్యారియర్లు

పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనం తినలేమంటూ పిల్లలు ఇంటినుంచి క్యారియర్లు తెచ్చుకుంటున్నారు. కొందరు తల్లులు తమ పిల్లలకు క్యారియర్లు తెచ్చిచ్చి పోతున్నారు. ఎందుకు ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారని విద్యార్థులను అడిగితే అన్నం సరిగా లేదని చెబుతున్నారు. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతంలో కాదు... ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన పులివెందులలోని జడ్పీ ఉన్నత పాఠశాల (రమణప్ప సత్రం)లోనే. ఆ పాఠశాలలో మంగళవారం పులిహోర, టమోట పప్పు చేశారు. పులిహోరలో చింతపండు, శనగబేడలు, ఉద్దిబేడలు, ఎండుమిర్చి, కరివేపాకు, జీలకర తదితర దినుసులు కనిపిస్తాయి. అయితే ఈ పాఠశాలలో చేసిన పులిహోరలో పచ్చి టమోట, పచ్చిమిరపకాయలు, అక్కడక్కడ కొత్తిమీర కనిపించాయి. టమోట పప్పును చట్నీ పప్పులా తెల్లగా చేశారు. అందులో దాదాపు సగం మంది విద్యార్థులు క్యారియర్లు తెచ్చుకున్నారు. అన్నం తింటున్న విద్యార్థులను ఆంధ్రజ్యోతి పలకరించింది. ఈ భోజనం తినలేక ఇంటి నుంచి తెచ్చుకుంటున్నామని, ఒక్కోసారి బియ్యం ఉడకవని అంటున్నారు. అందుకే ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకుంటున్నామన్నారు. పాఠశాలలో తయారు చేసిన అన్నాన్ని ఇది ఏం అన్నం అని ప్రశ్నించగా తమకు తెలియదని సమాధానమిచ్చారు. ఏనాడూ తమతోపాటు ఉపాధ్యాయులు భోజనం తిన్న దాఖలాలు లేవని అంటున్నారు. ఈ బియ్యం కేవలం సంగటి, దోసెలకు మాత్రమే పనికివస్తాయని పలువురు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రావు దృష్టికి తీసుకెళ్లగా చుట్టుపక్కల అన్ని పాఠశాలల కంటే తామే భేషుగ్గా చేస్తున్నామన్నారు. ఇంతకంటే మంచి భోజనం ఎక్కడా కనిపించదని ప్రభుత్వాన్ని వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేశారు.

తనిఖీలకు వెళ్తాం

విద్యార్థులు క్యారియర్లు తెచ్చుకుంటున్న విషయాన్ని ఎంఈవో-2 రామానాయుడు దృష్టికి తీసుకెళ్లగా తాము తనిఖీలకు వెళ్తామని అన్నారు. మెనూలో చెప్పిన ప్రకారం విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత హెచ్ఎంలదే అన్నారు. కొత్తబియ్యం అయినప్పటికి మరీ అంతముద్దగా కాదన్నారు. క్యారియర్లు తెచ్చుకుంటున్న విషయం తమ దృష్టికి రాలేదన్నారు. ఇకపై విద్యార్థులకు భోజనం రుచికరంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అడ్డుకునేవారెవరు..?



పెన్నానది వంతెన సమీపాన పడమరవైపు ఇసుక తరలించేందుకు ఏర్పాటు చేసుకున్న దారులు

- చీకటి పడగానే వాలుతున్న ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు
- అడ్డూ అదుపు లేని ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా
- చోద్యం చూస్తున్న అధికారులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 28: జమ్మలమడుగు మండలంలోని గూడెంచెరువు గండికోట దారి, సున్నపురాళ్లపల్లె, కొత్తరోడ్డు తదితర ప్రాంతాల్లో ఇసుక, మట్టి యథేచ్ఛగా అక్రమరవాణా జరుగుతోంది. గత నెలలో రాత్రీపగలు అనే తేడా లేకుండా తరలించేవారు. ఇటీవల సంబంధిత అధికారులు బదిలీ అయి కొత్తవారు వచ్చారు. దీంతో ఇప్పుడు రాత్రిపూట మాత్రమే అక్రమ రవాణా జరుగుతోంది. ఇసుక, ఎర్రమట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

గూడెం చెరువు గ్రామం గూడాదేవి చెరువులోంచి మట్టి తరలించడం కోసం చెరువులో మూడువైపుల దారులు ఏర్పాటు చేసుకున్నారు. ఒకవైపు అధికారులు, పోలీసులు వచ్చినా మరోవైపు నుంచి ట్రాక్టర్లు, ఎక్సకవేటర్లు తీసుకుని వెళ్లిపోయేందుకు ఏర్పాటు చేసుకున్నట్లు గ్రామస్తుల ద్వారా తెలుస్తోంది. గండికోట మార్గంలో రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా మట్టి తవ్వి తరలించడంతో గుంతలు దర్శనమిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు, అధికారుల అండతో మట్టి తరలిస్తున్నట్లు విమర్శలు వినపడుతున్నాయి.

పెన్నా నదిలో..

అలాగే జమ్మలమడుగు-ముద్దనూరు రోడ్డులో వంతెన కింద పడమరవైపు ఇసుక తరలింపు కోసం దారి ఏర్పాటు చేసుకున్నారు. గతంలో పెన్నానది వంతెన పిల్లర్ కుంగిపోయినప్పుడు అదే నదిలో అప్పటి ఇసుక రీచ్‌కు సంబంధించిన ప్రతినిధి గ్రావెల్ వేసి అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేశారు. మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీరు వదిలినప్పుడు ఈ రోడ్డు అక్కడక్కడ దెబ్బతింది. ప్రస్తుతం నదిలో నీళ్లు తగ్గడంతో ఆ దారిలో గుంతలకు మరింత మట్టిపోసి రాత్రి సమయాల్లో ఇసుక తరలిస్తున్నారు.



గూడాదేవి సమీపాన గ్రావెల్ తరలింపుకోసం ఏర్పాటు చేసుకున్న దారి

చీకటి పడితే చాలు..

చీకటి పడగానే గూడెం చెరువులోని గూడాదేవి చెరువు వద్ద, గండికోట దారిలో, పెన్నానది వంతెన సమీపాన గద్దలు వాలినట్లుగా ట్రాక్టర్లు, ఎక్సకవేటర్లు వాలుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. అలాగే జమ్మలమడుగు మండలంలోని మోరగుడి మూడురోడ్ల కూడలి వైపు నుంచి టీచర్స్ కాలనీవైపు నుంచి, తాడిపత్రి రోడ్డులో రచ్చబండ సమీపం నుంచి పెన్నా నది గుండా అక్రమంగా రవాణా చేస్తున్నారు. అలాగే మైలవరం మండలం దొమ్మరనంద్యాల గ్రామంలో చీకటి పడినప్పటి నుంచి తెల్లవారుజాము వరకు జోరుగా బయటి ప్రాంతాలవారు ఇసుక అక్రమంగా తీసుకెళుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఇసుక, గ్రావెల్ తరలి పోతోందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఈ సమస్యకు సంబంధించి జమ్మలమడుగు తహశీల్దారు కరుణాకరను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తమ సిబ్బందిని ఏర్పాటు చేసి ఎక్కడా మట్టి, ఇసుక తరలిపోకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు.



గూడాదేవి చెరువు నుంచి మట్టి తరలించే వారు దారి ఏర్పాటు చేసుకున్న దృశ్యం

అనారోగ్యంతో విద్యార్థిని ఆత్మహత్య

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 28 : అనారోగ్య కారణాల వల్ల మనస్థాపానికి గురై గురు మౌనిక (19) అనే విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. పోరుమామిళ్లలోని బలిజకోట వీధికి చెందిన గురుమౌనిక తన తండ్రి చనిపోవడంతో మేనత్త వెంకటలక్షుమ్మ వద్ద ఉంటూ విద్యాభ్యాసం చేసేదని, ఇటీవల ఆ విద్యార్థినికి ఫిట్స్ రావడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుందని, ఈ నేపథ్యంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ సంఘటనాస్థలానికి వెళ్లి వివరాలు ఆరా తీశామన్నారు. అనారోగ్య కారణాల వల్లనే ఆ విద్యార్థిని మృతి చెందినట్లు మేనత్త వెంకటలక్షుమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామన్నారు. మృతి చెందిన విద్యార్థిని పోరుమామిళ్ల ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోందని తెలిసింది.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి (ఫైల్)

ముద్దనూరు ఫిబ్రవరి28: మండల పరిధి కడప,తాడిపత్రి హైవే లోని కొత్తపల్లె గ్రామ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. మృతునికి దాదాపు 50 నుంచి 60 సంవత్సరాల వయస్సు ఉంటుందన్నారు. రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ముద్దనూరు పోలీసులను సంప్రదించాలని సీఐ తెలిపారు.

టిప్పరు ఢీకొని బాలికకు గాయాలు



ప్రమాదంలో గాయపడ్డ చిన్నారి

వల్లూరు, ఫిబ్రవరి 28 : మండల పరిధిలోని గాలివారిపల్లె సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారికి తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు... గాలివారిపల్లెకు చెందిన సునీల్, వెంకటసుబ్బమ్మ దంపతుల కూతురు లిఖిత (3) రోడ్డు దాటుతుండగా కడప వైపు వెళుతున్న టిప్పరు ఢీకొంది. ఆమె ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. 108 వాహనంలో కడప రిమ్స్‌కు, అనంతరం వేలూరుకు తీసుకెళ్లినట్లు సమాచారం. ఎస్ఐ వెంకటరమణ సంఘటనాస్థలాన్ని పరిశీలించి ఆరా తీశారు. టిప్పరును స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కడప ఎన్జీవో కాలనీలో చోరీ

కడప (క్రైం), ఫిబ్రవరి 28: నగరంలోని ఎన్జీవో కాలనీలో ఓ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. ఎన్జీవో కాలనీకి చెందిన సురేశ్, అతడి భార్య ఇరువురూ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. మంగళవారం వారు డ్యూటీకి వెళ్లిన సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లోకి దూరి 10 తులాల మేర బంగారు నగలు అపహరించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

విజిలెన్స్ దాడుల్లో సిలిండర్లు సీజ్



సీజ్ చేసిన గ్యాస్ సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

కడప (క్రైం), ఫిబ్రవరి 28 : గృహావసరాల కోసం వినియోగించే గ్యాస్ సిలిండర్లను హోటళ్లలో వాడుతున్నట్లు తెలియడంతో కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. సిలిండర్లను సీజ్ చేశారు. మైదుకూరు పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న శ్రీలక్ష్మి నరసింహ హోటల్‌పై దాడులు నిర్వహించి ఐదు సిలిండర్లను సీజ్ చేసి వెన్నెల భారత్ గ్యాస్ ఏజన్సీకి అప్పగించారు. హోటల్ యజమాని యు.నరసింహయ్యపై కేసు నమోదు చేశారు. వాణిజ్య అవసరాలకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వాడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు జి.ఈదురుబాషా, ఎంఆర్ఐ మహేంద్రనాధరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ జనార్దన్‌రావు, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో రంగస్వామి

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 28: గంగమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, జాతర మార్చి 10 నుంచి 12వ తేదీ వరకు జరుగుతుందని, అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని రాయచోటి ఆర్డీవో రంగస్వామి, డీఎస్పీ మహబూబ్‌బాషలు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం స్థానిక గంగమ్మ ఆలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగమ్మజాతరకు లక్షల సంఖ్యలో భక్తులు వస్తారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు సకాలంలో మంచినీరు అందించాలని, రెవెన్యూ, పంచాయతీ, సిబ్బంది జాతరలో అందుబాటులో ఉండి సమస్యలు గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి క్షణం అందుబాటులో ఉండాన్నారు. జాతరలో అక్రమ మద్యం, నాటుసారా, విక్రయాలు జరగకుండా చూడాలని ఎక్సైజ్ సిబ్బందికి సూచించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. కుంకుమ, చాందినీబండ్లు, బాణసంచాలు, ఊరేగింపుల వల్ల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ రెడ్డెన్న, సీఐ జీవన్ గంగనాథ, ఎంపీటీసీ సమరసింహారెడ్డి, కమిటీ సభ్యులు రెడ్డెయ్య, సర్పంచు వెంకటనారాయణరెడ్డి, ఆలయ ఈఓ రవీంద్రరాజు, పంచాయతీ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో రీజనల్ జాయింట్ కమిషనర్



గండి క్షేత్రంలో ఎంవీఎస్ మూర్తి

చక్రాయపేట, ఫిబ్రవరి 28: ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండిలో వెలసిన వీరాంజనేయస్వామిని బుధవారం తిరుపతి రీజనల్ జాయింట్ కమిషనర్ ఎంవీఎస్ మూర్తి దర్శించుకున్నారు. ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజల ఆదేశాల మేరకు ఆలయ అర్చకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. పూజల అనంతరం శాలువా కప్పి స్వామివారి చిత్రపటం అందించి సత్కరించారు. అనంతరం ఆయన క్షేత్రంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటటెండెంట్ తిరుమలరెడ్డి, రాయచోటి వీరభద్రస్వామి దేవస్థానం ఈఓ రమణారెడ్డి పాల్గొన్నారు.

ఒక్క యూనిట్ కూడా వృథా కాకూడదు

విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు : ఎస్ఈ రమణ



విద్యుత్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న ఎస్ఈ

చిన్నమండెం, ఫిబ్రవరి 28: మండలంలోని విద్యుత్ కార్యాలయాన్ని ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా విద్యుత్‌శాఖ అధికారి సూపరిండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ సందర్శించారు. నెలసరి విద్యుత్ బిల్లుల వసూళ్ల లక్ష్య సాధన కొరకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సిబ్బందిని హెచ్చరించారు. చిన్నమండెంలో విద్యుత్ అంతరాలు అధికంగా ఉన్నాయని, ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ పొలాలకు విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరం తద్వారా అంతరాయాలు ఏర్పడటమే కాకుండా విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తాయని ప్రజలను చైతన్యవంతులు చేసి విద్యుత్ ప్రమాదాలు లేకుండా చేయాలని తెలిపారు. తక్కువ ఎత్తులో ఉన్న లైన్లను గుర్తించి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా శాస్త్ర పరిశోధనలు

గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత్‌ది మెరుగైన స్థానం : వైవీయూ వీసీ



సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 28 : ఆధునిక శాస్త్ర పరిశోధనలతో ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలిచి భవిష్యత్తులో వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకుంటుందని వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతాసుధాకర్ స్పష్టం చేశారు. బుధవారం వైవీయూ జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేశారు. ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి హాజరైన వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ ఈ ఏడాది జాతీయ సైన్స్ దినోత్సవం టీం వికసిత్ భారత్ కోసం స్వదేశీ సాంకేతికతగా నిర్ణయించారన్నారు. సైన్స్ టెక్నాలజీ ఇన్నోవేషన్ల పట్ల ప్రజల ప్రశంసలు ప్రోత్సహించడంలో వ్యూహాత్మక దృష్టిని ప్రతిబింబిస్తుందన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం స్వదేశీ సాంకేతికత ద్వారా సవాళ్లను పరిష్కరించడానికి భారతీయ శాస్త్రవేత్తల విజయాలు సాధించారన్నారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాదు మాజీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు అప్పారావు భారతదేశంలో విజ్ఞాన పర్యావరణ శాస్త్రాల పురోగతి అనే అంశంపై కీలకోపన్యాసం చేశారు. సైన్స్‌తో ప్రపంచమంతా ప్రయోజనం పొందుతుందన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ప్రేరణతోనే విజ్ఞానశాస్త్ర ప్రగతి ఉంటుందన్నారు. వాతావరణ మార్పు, జీవవైవిధ్యం, పర్యావరణ స్థిరత్వం, ఆహార భద్రత, మైక్రో ప్లాస్టిక్ ముప్పు, అణు భద్రత, మానవ జనాభా వంటి గ్లోబల్ సవాళ్లను ఎదుర్కొనే దిశగా పరిశోధనలు సాగాలన్నారు. రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ సైంటిస్టుల వల్లనే అన్ని సౌకర్యాలు పొందగలుగుతున్నామన్నారు. చెన్నై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రొఫెసరు రమేష్ లక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో సైన్స్‌డే కమిటీ సభ్యులు , విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యూనివర్సిటీలో అడుగుపెట్టే అర్హత ఆయనకు లేదు



జగదీశ్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 28 : యోగివేమన యూనివర్సిటీలో జరిగిన సైన్స్‌డే సెమినార్‌కు ముఖ్యఅతిథిగా హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ అప్పారావును పిలవడంపై విద్యార్థి సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోబ్యాక్ అప్పారావు అంటూ నినాదాలు చేశారు. అడ్మినిస్ట్రేషన్ బిల్డింగులో జరుగుతున్న సెమినార్‌ను రాయలసీమ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆర్వీఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మల్లేల జగదీశ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన హెచ్‌యూ పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల ఆత్మహత్యకు కారకుడైన మాజీ వైస్‌చాన్సలర్ అప్పారావుపై ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. ఇటువంటి విద్యా ద్రోహిని యూనివర్సిటీకి చీఫ్ గెస్ట్‌గా పిలవడం సిగ్గుచేటన్నారు. కులం పేరుతో పరిశోధక విద్యార్థి రోహిత్ వేములను అవమానించి ఆత్మహత్య చేసుకునేలా చేశాడన్నారు. అప్పారావును పిలవడంపై యూనివర్సిటీ విద్యార్థులకు వీసీ, రిజిస్ట్రార్ బహిరంగ క్షమాపణ చెప్పాలని లేదంటే ఈ విషయంపై గవర్నరుకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్వీఎస్ పరిశోధక విద్యార్థి భరత్, సుమన్ పాల్గొన్నారు.

వైవీయూ ప్రతిష్ట దిగజారుస్తున్న అధికారులు: ఏఐఎస్ఎఫ్

పరిశోధక విద్యార్థి మృతికి కారకుడైన వైస్ చాన్సలర్ అప్పారావును వైవీయూలో సైన్స్‌డేకి ముఖ్యఅతిథిగా పిలవడం సహించరానిదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు తెలిపారు. 2016లో హెచ్‌సీయూకు చెందిన రోహిత్ వేముల అనే విద్యార్థిని కుల అహంకారంతో వేధింపులకు గురి చేయడంతో పాటు, పరిశోధనకు సంబంధించిన నిధులు రాకుండా అడ్డుకుని ఆత్మహత్యకు ప్రేరేపించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దీనిపై యూనివర్సిటీ అధికారులు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్, శివతేజ, చంద్ర, లక్ష్మినారాయణ పాల్గన్నారు.

మాతృమరణాలు జరగకుండా చర్యలు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 28: జిల్లాలో పేదలకు వైద్యసేవలు మెరుగ్గా అందేలా వైద్యశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, గ్రామీణ మారుమూల ప్రాంతాల్లో కూడా మాతృ మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఓఎస్డీ రఘునాథ్ పేర్కొన్నారు.

జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్సు హాలులో మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని కామనూరు, కల్లూరు, కలసపాడు, దువ్వూరు, వనిపెంట ప్రాథమిక ఆసుపత్రుల పరిధిలో గతంలో సంభవించిన మాతృమరణాలపై సమీక్ష నిర్వహించారు. మాతృ మరణాలకు సంబంధించి గల కారణాలను సంబంధిత పీహెచ్‌సీ వైద్యులు, ఉన్నత ఆసుపత్రుల స్పెషలిస్టు వైద్యులు, ప్రైవేట్ నర్సింగ్ వైద్యులతో చర్చించారు. ఆసుపత్రుల్లో అందించిన వైద్య సేవలపై ఆరా తీశారు. మాతృమరణాలపై నివేదికలు ఇవ్వాలని విచారణాధికారిగా డీసీహెచ్ఎస్‌కు సూచించారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమాదేవి, డాక్టర్ లక్ష్మీసుశీల, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, వైద్య, ఆరోగ్య శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భార్య కళ్ల ముందే భర్తను కబళించిన మృత్యువు

ములకలచెరువు, ఫిబ్రవరి 28: భార్య కళ్ల ముందే భర్తను మృత్యువు కబళించింది. రోడ్డు దాటుతున్న రైతును గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు...మండలంలోని బురకాయలకోట పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన రైతు బిల్లా వెంకటరమణ, అతడి భార్య లక్ష్మమ్మ మదనపల్లె మండలం సీటీఎంలో జరిగిన తిరుణాలకు వెళ్లారు. తిరుణాల చూసుకుని తిరిగి బుధవారం ఉదయం స్వగ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో బురకాయలకోటలో ఆర్టీసీ బస్సు దిగి ముంబాయి-చెన్నై జాతీయ రహదారి దాటుతుండగా రైతు వెంకరమణను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య కళ్ల ముందే వెంకటరమణను మృత్యువు కబళించడంతో ఆమె సొమ్మసిల్లి పడిపోయింది. తేరుకొనే సరికి భర్త మృతి చెందడంతో భోరున విలపించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. రెడ్డివారిపల్లెలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

నేడు కడపకు కంచి పీఠాధిపతి రాక

కడప (కల్చరల్) ఫిబ్రవరి 28: విజయయాత్రలో భాగంగా కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి ఈనెల 29వ తేదీ గురువారం కడప నగరానికి రానున్నారు.

మార్చి 2వ తేదీ శనివారం వరకూ కడప నగర సందర్శన చేయనున్నారు. మూడు రోజుల పాటు కడప-తిరుపతి హైవే రోడ్‌లోని చిన్మయ మిషన్ లలితా పంచాయతన దేవాలయంలో ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి 9 గంటలకు భక్తులకు స్వామి వారి దర్శనం, ఆశీర్వాదం, త్రికాల పూజ, విశేష పూజలు నిర్వహించనున్నారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, వారి ఆశీర్వాదాన్ని పొందాలని చిన్మయమిషన్ ప్రతినిధులు కోరారు.

రెండోరోజు ప్రశాంతంగా టెట్



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అబ్జర్వర్, డీఈవో


రాయచోటిటౌన్, ఫిబ్రవరి 28: ఉపాధ్యాయ పోస్టుల కోసం డీఎస్సీ రాయబోయే అభ్యర్థులు ముందుగా ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్ష రాయాల్సి ఉంది. ఇందులో భాగంగానే అటు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ఇటు ఎస్జీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న టీటీసీ, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 27వ తేదీ మంగళవారం నుంచి మార్చి 6వ తేదీ వరకు 9 రోజుల పాటు ఉపాధ్యాయ అర్హత పరీక్షకు హాజరు కానున్నారు. ఇందులో భాగంగానే విద్యాశాఖ అధికారులు జిల్లాలోని రాజంపేట అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కళాశాల, మదనపల్లెలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాల, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే బుధవారం రెండోరోజు ఉదయం జరిగిన సెక్షన్-1 పరీక్షకు 350 మందికి గానూ 298 మంది హాజరుకాగా, 52 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాలేదు. అలాగే మధ్యాహ్నం జరిగిన సెక్షన్-2 పరీక్షకు 348 మందికి గానూ 303 మంది హాజరుకాగా 45 మంది పరీక్షకు హాజరు కాలేదు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సందర్భంగా సిమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య, డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, డిపార్టుమెంటల్ అధికారి, ఎంఈవో బాలాజీనాయక్‌లు రాయచోటి పట్టణంలోని సాయి ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగరాజ



నియామకపత్రం అందుకుంటున్న నాగరాజ

వేంపల్లె, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీగా వేమా నాగరాజ ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం వేంపల్లెలోని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి చేతులమీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నకేశవ, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉత్తన్న, జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, అమర్‌నాథరెడ్డి, మదనపల్లె పార్లమెంట్ అభ్యర్థి రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పాసుపోర్టు పోయినది

తుంటి నరసింహులు తండ్రి కొండయ్య D.No. 2/71, ఎగువ సిద్దవరం విలేజ్, పెనగలూరు మండలం, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియన్ పాసుపోర్టు నెం. L9588639 పోయినది. దొరికినవారు అందజేయగలరు Ajc-185474

కావలెను

రూపశ్రీ న్యూరో మైండ్ క్లినిక్ నందు పనిచేయుటకు Receptionist కావలెను. అడ్రస్ : డోర్ నెంబర్ 3/41, సాయిబాబా థియేటర్ ఎదురుగా,విష్ణుప్రియ హోటల్‌ప్రక్కన, ఆర్.ఎస్. రోడ్, కడప, సెల్ : 80749 53824 Ajc-185247

WANTED

★ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటి పని వంట పని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనము. జీతం: 20k. Ph: 8977639662, 8977639663 AJH-14152

CHANGE OF NAME

★ I, SHAIK HABEEBULLAH BASHA (Old Name) 15/109-upstair, Pedda Besta Street, Kadapa, YSR District, A.P. India. Have changed my name to SHAIK HABEEBULLAH (New Name). AJH-002270

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్ పేమెంట్ చేయబడును.(రిజిస్టర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647 AJA- 176967

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి


నాగరాజుపేట: సర్ సీవీ రామన్‌కు నివాళులర్పిస్తున్న అధికారులు ఉపాధ్యాయులు


శ్రీచైతన్య పాఠశాలలో సైన్స్ నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు


కోవరంగుట్టపల్లి పాఠశాలలో డ్రిప్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌పై వివరిస్తున్న విద్యార్థినులు


వేంపల్లె: చైతన్య హైస్కూల్లో సైన్స్‌ఫేర్ ప్రారంభిస్తున్న చక్రపాణిరెడ్డి

శాస్త్రవేత్తల్లో అగ్రగణ్యుడు సర్ సీవీ రామన్!

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి28 : ఆధునిక భారతీయ శాస్త్రవేత్తల పరిశోధన ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన వ్యక్తుల్లో సర్ సీవీ రామన్ అగ్రగణ్యుడని స్టెప్ ముఖ్య కార్య నిర్వహణాదికారి సాయిగ్రేస్ కొనియాడారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నగరంలోని గంగాభవానీ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ ఫేర్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నమూనాలను పరిశీలించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు సోఫియా, మేనేజరు సుబ్బరాయుడు, వి.నారాయణ, విద్యార్థులుపాల్గొన్నారు.


కడప (ఎర్రముక్కపల్లె): చిన్నచౌకు శ్రీచైతన్య పాఠశాలలో ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి, వైవీయూ పాలక మండలి సభ్యురాలు డాక్టర్ జె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల కు స్కూలు స్థాయి నుంచే సైన్స్‌పై అవగాహన ఉండాలన్నారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఎలా ఉన్నాయో, కొన్ని సంవత్సరాల్లో శాస్త్రవేత్తలకు కూడా అంతే అవకాశాలుంటాయని ప్రతి ఒక్కరూ పరిశోధనల వైపు దృష్టి పెట్టాలని సూచించారు. చిన్నారులకు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం రమణయ్య, ప్రిన్సిపాల్ నాగభూషణం పాల్గొన్నారు.

సికెదిన్నె: సైన్స్ ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని చింతకొమ్మదిన్నె ఎంఈవో వెంకటరామిరెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారతీయ శాస్త్రవేత్తల ఛాయా చిత్రాల ఎగ్జిబిషన్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ సైన్స్ అన్ని రంగాల్లో అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. సీవీ రామన్ రామన్ ఎఫెక్ట్ ఫలితంగా ప్రతి సంవత్సరం ఆయన పుట్టిన రోజును సైన్స్‌డేగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం: విద్యార్థులు సృజనాత్మకతతో అద్భుత ప్రాజెక్టులు రూపొందించారని ప్రధానోపాధ్యాయురాలు రవణమ్మ తెలిపారు. కోవరంగుట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్సు ఉపాధ్యాయులు సతీష్, గాయత్రి ఆధ్వర్యంలో విద్యార్థులు సైన్సు ప్రదర్శన ఏర్పాటు చేశారు. అద్భుత ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందిస్తూ, వారికి బహుమతులు అందజేశారు.

వేంపల్లె: విద్యార్థులందరు సైన్స్‌పై పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని చైతన్య హైస్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి విద్యార్థులకు సూచించారు. స్థానిక చైతన్య హైస్కూల్లో బుధవారం సైన్స్‌ఫేర్ నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి, ఉపాధ్యాయు లు పాల్గొన్నారు. శ్రీనివాస హైస్కూల్లో సైన్స్‌ఫేర్ నిర్వహించారు. కరస్పాండెంట్ కేశవులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె: పాయసంపల్లె కందుల మంగమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ఉపాధ్యాయుడు కృష్ణకిషోర్, ఆదినారాయణ, మస్తాన్, సుజా, మోహన్, రాజశేఖర్, మల్లికార్జునరెడ్డి, సుబ్బన్న, జయరాణమ్మ తదితరులు పాల్గొన్నారు.



రైతుల ఖాతాల్లో ప్రతి ఏటా రూ.20వేలు జమ : పుత్తా

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 28: అన్నదాత పథ కం ద్వారా ప్రతి రైతు ఖాతాలో ఏటా రూ.20వేలు ఒకేసారి జమచేస్తామని కమలాపురం టీడీపీ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. బుధ వారం సాయంత్రం మండల టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, సంగమేశ్వర ఆలయ మాజీ చైర్మన్ మురళీమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. మహిళలకు, రైతులకు, నిరుద్యోగుల సంక్షేమానికి ప్రవేశపెట్టే పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బాబు, ధర్మారెడ్డి, ఓబయ్యయాదవ్, గోపీనాథ్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, ఓబులేస్ యాదవ్, గంగిరెడ్డి, శేఖర్‌రెడ్డి, నూరారెడ్డి, లక్ష్మిరెడ్డి, శివ, వెంకటరమణా రెడ్డి, పోలీస్‌రాజ, గోపీనాథ్‌రెడ్డి, చెన్నారెడ్డి, వీరయ్యయాదవ్, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్నపుత్తా నరసింహారెడ్డి

'జగన్‌రెడ్డి పాలనలో.. ఇసుకే బంగారం'

కడప (మారుతీనగర్) ఫిబ్రవరి 28. ఇసుకను బంగారంగా చేసిన ఘనత మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికే సాధ్యమైందని, భారతీయ జనతాపార్టీ జిల్లా అధికార ప్రతినిధి పాలెం సురేష్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. స్థానిక ఎన్‌జీవో కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పేదలకు అందుబాటులో వున్న ఇసుక ప్రస్తుత వైసీపీ పాలనలో పేదలకు అందనంతగా మారడం దారుణమన్నారు. దీంతో భవన నిర్మాణ కార్మికులు, కూలీల బతుకులు దయనీయంగా మారాయన్నారు. వైసీపీ పాలనలో పేదల భూములు, స్థలాలను దౌర్జన్యంగా హస్తగతం చేసుకోవడంతో పాటుగా, ఇసుకను జగన్‌రెడ్డి తన అనుచరులకు ఆదాయ వనరుగా చేశాడన్నారు. దీంతో రాత్రి, పగలూ అనే తేడా లేకుండా టిప్పర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే కొత్త ఇసుక విధానం పేరుతో తక్కువ ధరకే ఇసుకను అందజేస్తామంటూ కొత్త నాటకానికి తెరలేపారని ధ్వజమెత్తారు. తదుపరి టెండర్లద్వారా ఇసుకను అందిస్తామంటూ మరో కొత్త డ్రామా ఆడారన్నారు. ఎలాంటి అనుమతులు లేకపోయినా గనులశాఖ అధికారులతోపాటు పోలీసులు ఇసుకాసురులకు కొమ్ముకాస్తున్నారని నిప్పులు చెరిగారు. రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 5 జిల్లాల్లోని 41 రీచ్‌లలో కూలీలతో మాత్రమే ఇసుకను తవ్వుకునేలా అనుమతులుండగా భారీ యంత్రాలు, వాహనాల సాయంతో తరలిస్తున్న తీరు దారుణమన్నారు. ముఖ్యంగా కడప జిల్లాలోని రీచ్‌ల నుంచి ఇసుక తరలించేందుకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. అయినా, జిల్లాలోని అధికారుల, పోలీసుల అండదండలతో అన్ని రీచ్‌ల నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. ఈనెల 28వ తేదీ బుధవారం ఉదయం వల్లూరు మండలం కొత్త గాలివారిపల్లె వద్ద ఓ ఇసుక లారీ కారణంగా ఓ చిన్నారి గాయపడిందన్నారు. ఇప్పటికైనా ఇసుకాసురుల దోపిడీని అరికట్టాలని కోరారు. సమావేశంలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ పాల్గొన్నారు.



బ్రౌన్ శాస్త్రిగా కీర్తి గడించిన జానమద్ది

● వైవీయూ వీసీ చింతా సుధాకర్

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 28 : సీపీ బ్రౌన్ నడియాడిన ప్రదేశంలో మొండి గోడలుగా ఉన్న బంగ్లాను జ్ఞానసౌధంగా తీర్చిదిద్ది బ్రౌన్ శాస్త్రిగా కీర్తి గడించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ జానుమద్ది హనుమచ్ఛాస్త్రి అని వైవీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతాసుధాకర్ తెలిపారు. బుధవారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి దశమ వర్ధంతిని నిర్వహించా రు. ముందుగా జానమద్ది విగ్రహానికి పూలమాల వేసి నివాళులు లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయం నిర్మాణం వెనుక హనుమచ్ఛాస్త్రి కృషి ఎంతో ఉందని, భవన నిర్మాణంతోపాటు నిధుల సేకరణ, పుస్త సేకరణ కోసం ఎన్నో ప్రాంతాలు తిరిగి పలువురు ప్రముఖులను కలిసి గ్రంథాలయ అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ జానమద్ది హనుమచ్ఛాస్త్రితో తనకు పరిశోధన చేసున్న నాటి నుంచి అనుభవం ఉందని, ఎప్పుడు ఆయనను కలిసినా ఆత్మీయంగా పలకరించి ప్రోత్సహించేవారన్నారు. అనంతరం నరాల రామిరెడ్డి అవధాన వైభవం అనే అంశంపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు.


హనుమచ్ఛాస్త్రికి నివాళులర్పిస్తున్న వైవీయూ వీసీ చింతా ప్రభాకర్ తదితరులు

వైభవంగా రంగనాథ స్వామి రథోత్సవం

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 28: బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధ వారం పులివెందులలో రంగనాథ స్వామి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్ర త్యేక పూజలు చేశారు. రథంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహా లను ఆసీనులను చేశారు. ఉద యం నుంచి భక్తులు టెంకాయలు కొట్టి మొక్కుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో రథాన్ని కదిలించారు. అక్కడి నుం చి పాతగంగిరెడ్డి ఆసుపత్రి, ము త్యాలవారివీధి, మసీదు వీధి, బంగారు అంగళ్ల మీదుగా తిరిగి పూలంగళ్ల సర్కిల్ వరకు రథోత్సవం సాగింది. భక్తుల గోవింద నామస్మరణలతో ఆయా ప్రాంతాలు మార్మోగాయి. పెద్దఎత్తున భక్తులకు అన్నదానం చేశారు. చెక్కభజనలు అలరించాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


రథోత్సవం సందర్భంగా చెక్కభజన చేస్తున్న కళాకారులు



హెచ్ఐవీపై అవగాహన

వేంపల్లె, ఫిబ్రవరి 28: ఎయిడ్స్ వ్యాధి అంటుకునే వ్యాధికాదు అంటించుకునే వ్యాధి అని కళాజాతా బృందం బుధ వారం వేంపల్లెలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పాతబజార్, రాజీవ్ కాలనీల్లో కళాజాతా బృందం హెచ్ఐవి/ఎయిడ్స్‌పై నాటక ప్రదర్శన నిర్వహించింది. హెచ్ఐవీ వ్యాప్తి, జాగ్రత్త లు, సుఖ వ్యాధులు, చికిత్స తదితర అంశాలను వివరిస్తూ ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ ఆంజనేయులు, సీడీఎస్ అకౌంటెంట్ నాగిన్ బాషా, ఔట్‌రీచ్ వర్కర్ పుష్పరాజు, సిబ్బంది పాల్గొన్నారు.


హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

కేంద్ర బలగాలకు వసతి ఏర్పాట్లపై ఎస్పీ పరిశీలన

కడప క్రైం, ఫిబ్రవరి 28: ఎన్నికల సందర్భంగా కడప, కమలా పురం, రాజంపేట నియోజకవర్గాల్లో విధులు నిర్వహించేందుకు వచ్చే కేంద్ర పోలీసు బలగాలకు వసతి కల్పనకు సంబంధించి ఎస్పీ సిద్ధార్థ కౌశల్ బుధవారం శిల్పారామం, రిమ్స్, డీటీసీలను సందర్శించి పరిశీలించారు. వారికి అవసరమయ్యే వసతుల వివరాలను డీఎస్పీ షరీఫ్‌ను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ అశోక్‌రెడ్డి, రిమ్స్ సీఐ రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం: తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో రైతు వ్యతిరేక ప్రభుత్వం ఉందని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని 2008 లోనే కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 70వేల కోట్ల రూపాయల వ్యవసాయ రుణాలను దేశవ్యాప్తంగా, 12 వేల కోట్ల రూపాయలు రుణాలను సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో మాఫీ చేసిందన్నారు. సాగునీటి రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎక్కువ ఖర్చుపెట్టేవన్నారు. విత్తన సబ్సిడీ, ఎరువుల సబ్సిడీ, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటలకు గిట్టుబాటు ధర, బిందు, తుంపర సేద్యం, సున్నావడ్డీ రుణాలు, పావలా వడ్డీ రుణాలు, ఉచిత విద్యుత్ సరఫరా తదితరాలతో కాంగ్రెస్ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని పండుగ చేశాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను రెండవ శ్రేణి పౌరులుగా చూస్తోందన్నారు. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని అడుగుతున్న రైతులపై కాల్పులుజరపగా శుభ కరణ్‌సింగ్ అనే రైతులు చనిపోయాడన్నారు.రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం రైతువ్యతిరేక ప్రభుత్వంగా తయారైందన్నారు. సున్నావడ్డీ రుణాలకు సున్నంపెట్టింది, పావలావడ్డీ రుణా లకు పాడెకట్టింది, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ సక్రమంగా అమలు కావడం లేదన్నా రు. వ్యవసాయ, సాగునీటి రంగాలకు బడ్జెట్ కేటాయింపులు గణనీయంగా తగ్గిపోయా యన్నారు. రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. జాతీయస్థాయిలో మన రా ష్ట్రం రైతుల ఆత్మహత్యల్లో మూడవస్థానంలో, కౌలురైతుల ఆత్మహత్యల్లో రెండవస్థానంలో ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక బిల్లులకు టీడీపీమద్దతిచ్చిందన్నారు.

విలేకరికి పరామర్శ

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 28 : ప్రమాదానికి గురైన విలేకరి సుబ్బరాయుడును టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి బుధవారంపరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి జరిగిన విషయం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

టీడీపీని ఆశీర్వదించండి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 28 : టీడీపీని ఒక్కసారి ఆశీర్వదిస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని కడప నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి రెడ్డప్పగారి మాధవీరెడ్డి తెలిపారు. బుధవారం కడప నగరం 39వ డివిజన్ చిలకలబావి ప్రాం తంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందన్నారు. ఎటు చూసినా మద్యం మాఫియా, ఇసుక మాఫియా, డ్రగ్స్ మాఫియా, రాజ్యమేలుతుందని ఆవేదన వ్యక్తం చేశారు . యువతకు ఉద్యోగావకాశాలు లేక తప్పు తోవలోకి వెళుతోందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఈ మాఫియాకు అంతం పడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆరిఫుల్లా, రామ్, లక్ష్మణ్, జిలానీ, జమీల్‌తో పాటు కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


బాబు ష్యూరిటీ.. కార్యక్రమంలో మాధవీరెడ్డి తదితరులు

వీఆర్ఏల సమస్యలపై 5న నిరాహార దీక్ష

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 28: గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ)ల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించా లని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ విజయవాడ అలంకార్ సెంటరు, ధర్నా చౌకు వద్ద కుటుంబ సభ్యులతో సహా మార్చి 5న ఉదయం 10 నుంచి నిరాహార దీక్ష నిర్వహిస్తున్నామని వీఆర్ఏల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య తెలిపారు. బుధవారం కడప హోచిమన్ భవన్‌లో ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20 వేల మందికి పైబడి గ్రామ రెవెన్యూ సహాయకులు పనిచేస్తున్నారన్నారు. దశాబ్దాలు గడిచిపోతున్నా వారి బతుకులు మారడం లేదన్నారు. కేవలం రూ.10,500 వేతనంతో ఇంటిల్లిపాది అర్ధాకలితో అలమటిస్తున్నామన్నారు. వీఆర్ఏలు హక్కుల సాధన కోసం మార్చి 5న విజయవాడలో తలపెట్టే నిరాహార దీక్షలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం, రాష్ట సహాయ కార్యదర్శి కోడూరు పుల్లయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మణికుమార్, శ్రీనివాసులు, నాయకులు నెల్లూరు సురేష్, కొరముట్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

2, 3 తేదీల్లో డీవైఎఫ్ఐ రాజకీయ శిక్షణ తరగతులు

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 28 : డీవైఎఫ్ఐ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు మార్చి 2, 3 తేదీల్లో బద్వేలులో నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్ తెలిపారు. బుధవారం ఆ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా అభివృద్ధిని మరిచాయన్నారు. విభజన హామీల్లో ప్రధానమైన కడప ఉక్కును సాధించడంలో ఘోరంగా విఫలం అయ్యాయన్నారు. జిల్లాలో భూనిర్వాసితులకు , యువతకు ఉద్యోగాలు లేవన్నారు. 2, 3 తేదీల్లో జరగబోయే జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న వీరనాల తదితరులు

అంకితభావంతో సేవలందించాలి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 28 : అంకిత భావంతో సేవలు అందించినప్పుడే గుర్తింపు లభిస్తుందని వైఎస్ఆర్ సంచార పశు వైద్యశాల రీజనల్ ప్రోగాం మేనేజరు కలీం తెలిపారు. బుధవారం కమలాపురం తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఉన్న 1962 వాహనాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. వాహన పనితీరు, సేవలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువుల వద్దకే వైద్యసేవలు అందాలనే ఉద్దేశం తో రాష్ట్ర ప్రభుత్వం ఈ వాహనాన్ని ఏర్పాటు చేసిందన్నారు. వాహనంలోని లాబోరేటరీ, మందులు ఎంత వరకు ప్రజలకు అందుబాటులో ఉన్నాయో పరిశీలించారు. 1962 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోను చేసి సంచార పశువైద్యశాల సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారి అనిల్‌కుమార్, కమలాపురం 1962 వాహన సిబ్బంది పాల్గొన్నారు.


పశువుల అంబులెన్స్ పని విధానాన్ని పరిశీలిస్తున్న రీజనల్ ప్రోగ్రాం మేనేజరు కలీం

ఓటరు జాబితాలో తప్పులుంటే ఫిర్యాదు చేయండి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 28 : ఓటరు జాబితాలో తప్పులు ఉంటే లిఖిత పూర్వకగా ఫిర్యాదు చేయవచ్చని కమలాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రమోహన్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు లిస్టులో ఇంకా ఏవైనా తప్పులుంటే తహసీల్దారు కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు వెరిఫికేషన్ చేశారని, ఇంకా కొన్ని చోట్ల డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వారి పేర్లు ఓటరు లిస్టులో ఉన్నాయని, వాటిని తొలగించాలని రాజకీయ పార్టీ నాయకులు ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావడంతో, పరిశీలిస్తామని సమాధానమిచ్చారు.


మాట్లాడుతున్న ఈఆర్‌వో చంద్రమోహన్

యూనివర్సిటీలు మూఢ విశ్వాసాలకు అతీతంగా ఉండాలి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 28 : విశ్వవిద్యాలయాలు శాస్త్ర పరిశోధనాలయాలుగా ఉండాలే తప్ప మూఢ విశ్వాసాలకు స్థానం ఉండకూడదని ప్రముఖ మెజీషియన్ సృజన్‌కుమార్ తెలిపారు. బుధవారం వైవీయూలో జాతీయ సైన్స్‌దినోత్సవంలో భాగంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ ప్రాధాన్యం.. సమాజంలో దాని పాత్ర అనే విషయాలపై ఇంద్రజాలాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక దినోత్సవం, ప్రొఫెసరు సీవీ రామన్ జన్మదినం కూడా ఇదే రోజన్నారు. మూఢ నమ్మకాలను అడ్డుగా పెట్టుకుని కొంత మంది ప్రజలను మోసగిస్తున్న విధానాన్ని ఇంద్రజాలంతో ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ ఎస్.రఘునాథరెడ్డి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ షావల్లిఖాన్, సైన్స్ డీన్ డాక్టర్ వెంకట్రామిరెడ్డి కె.కృష్ణారెడ్డి, డాక్టర్ దాక్షాయణి మెజీషియన్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు శివరామిరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.


ఇంద్రజాలం ప్రదర్శిస్తున్న మెజీషియన్ సృజన్‌కుమార్

మాజీ వీసీ అప్పారావును చీఫ్ గెస్ట్‌గా పిలవడం దారుణం

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 28: మాజీ వైస్ చాన్సలర్ అప్పారావును వైవీయూకు ముఖ్యఅతిథిగా పిలవడం దారుణమని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న విమర్శించారు. బుధవారం ప్రగతి నర్సింగ్‌హోంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ హెచ్‌సీయూలో పరిశోధక విద్యార్థి రోహిత్ వేముల 2016లో అప్పారావు వేధింపుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. రోహిత్ తన పరిశోధనలకు రావాలసిన నిధులను నిలబడేలా చేసి కులపరంగా క్యాంపస్‌లో వేధింపులకు గురి చేశారన్నారు. ఇటువంటి వ్యక్తిని వైవీయూలో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పిలవడం దారుణమన్నారు. తక్షణం వైవీయు అధికారులు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు స్వరూప్‌తేజా, గణేశ్ పాల్గొన్నారు.

రామాలయానికి భూమిపూజ

సికెదిన్నె, ఫిబ్రవరి 28: చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు హరిజనవాడలో బుధవారం రామాలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు.. అనంతరం ఆలయ పనులను దాతల సహకారంతో త్వరగా చేపడుతామని కార్యనిర్వాహకులు తెలిపారు. గుర్రాల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గుత్తిరెడ్డి లక్ష్మిరెడ్డి, కుమార్తె ఉమాదేవి, అల్లుడు శ్రీనివాసులరెడ్డి సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పొట్టిపాటి వినోద్‌కుమార్‌రెడ్డి, రాధా దంపతులు, కె.సత్యనారాయణరెడ్డి, గుర్రాల రెడ్డయ్య, కృష్ణయ్య, రామాంజనేయులు, ప్రవీణ్, మధు, తదితరులు పాల్గొన్నారు.


ఊటుకూరు హరిజనవాడలో రామాలయానికి భూమిపూజచేస్తున్న గ్రామస్థులు

టీడీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరు



ప్రొద్దుటూరులో ప్రచారం చేస్తున్న సీఎం సురేశ్‌నాయుడు, ప్రవీణ్‌రెడ్డి, కాశినాయనలో ప్రచారం చేస్తున్న బొజ్జ రోశన్న

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 28 : టీడీపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరని టీడీపీ రాష్ట్ర నాయకుడు సీఎం సురేశ్‌నాయుడు టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 41 వవార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ఉప్పువాగు, యానాది కాలనీలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాబు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీచేశారు. మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, మున్సిపల్‌మాజీ చైర్మెన్ వీఎస్ ముక్తియార్, మాజీ ఎంపీపీ శెట్టి ప్రభాకర్‌రెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగరాజు, గంజికుంట అంజనేయులు,కృష్ణ వేణిపాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: రాష్ట్రంలో వైసీపీని మట్టికరిపించడానికి ప్రతి టీడీపీ కార్యకర్త కంకణం కట్టుకోవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు.బుధవారం 5 వవార్డులోని భవాని నగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ప్రవీణ్‌రెడ్డి చేపట్టారు. కార్యక్రమంలో బొమ్మిడి ప్రసాద్ బూసా నాగేష్‌రెడ్డి, నాగమునిరెడ్డి తంగపట్నం జయరామకృష్ణ, హరీశ్వర్‌రెడ్డి, సోమా రాజారెడ్డి, ముదిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, జబీవుల్లా, బాబుల్‌రెడ్డి, రాజుపాలెం కన్వీనర్ విశ్వనాథరెడ్డి, మాజీ కౌన్సిలర్ సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: చంద్రన్నతోనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని బొజ్జ అరుణ, మాచుపల్లె లక్ష్మీదేవి, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని రిక్షా కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు.కార్యక్రమంలో నాగరత్నమ్మ, ప్రమీల, కేవీ సుబ్బారెడ్డి, సాంబశివారెడ్డి, సుబ్బరాయుడు, వెంకటసుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశినాయన..: సాధారణ ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని టీడీపీ బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జా రోశన్న పేర్కొన్నారు. బుధవారం టీడీపీ జిల్లా కార్యదర్శి పోలు మురళీక్రిష్ణతో కలిసి రెడ్డికొట్టాల గ్రామంలో ఇంటింటికి వెళ్లి భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాలు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఓ.రోహిత్‌రెడ్డి, బాలాజీ,పోలయ్య,శ్రీనివాసులు,రామకృష్ణ,శివయ్య తదితరులు పాల్గొన్నారు.


జమ్మలమడుగు..: టీడీపీని ఆదరించాలని నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి, తల్లి సరస్వతి అభ్యర్థించారు. బుధవారం సాయంత్రం జమ్మలమడుగు పట్టణంలోని 10వ వార్డు నేతాజీ నగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకులు సుబ్బలక్షుమ్మ, అనిత, భాగ్యమ్మ, దేవమ్మ, మరియమ్మ, సంజమ్మ, నవనీశ్వర్‌రెడ్డి, కొండయ్య, సుబ్బరాయుడు, మునిస్వామి, దస్తగిరి, దేవేంద్ర, సుబ్బు, గురుక్రిష్ణ, భద్రయ్య, ఓబులేసు, మారుతి, శంకర్, సుదర్శన్, రఘు, హరి, యోహాన్, శంకర్, శివారెడ్డి, హర్ష, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు


గోపవరం, ఫిబ్రవరి 28 : మండల పరిధిలోని పీపీకుంట కూడలికి సమీపంలో ఉన్న కంపచెట్లలో మంగతాయి ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ బుధవారం తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ సిబ్బందితో కలిసి పేకాటరాయుళ్లపై దాడి చేయగా రూ1.33,600 నగదును సీజ్ చేసి పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కొండాపురం మండల సమావేశం

కొండాపురం, ఫిబ్రవరి 28: మండల సర్వసభ్య సమావేశం గురువారం జరగనుందని ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు.ఉదయం 10.30 గంటలకు స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఎంపీడీవో ఒక ప్రకటనలో తెలిపారు.









మున్సిపల్ కమిషనర్‌గా రఘునాథరెడ్డి

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 28 : ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా రఘునాథరెడ్డి బుధవారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బదిలీ పై వెళుతున్న కమిషనర్ మల్లికార్జున రఘునాథరెడ్డికి చార్జ్ అప్పగించారు. జనవరి 28 న బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ మల్లికార్జున ఫిబ్రవరి 28న బాధ్యతలనుంచి వైదొలగటం చాలా యాదృచ్ఛింగా జరగటంపై ఉద్యోగుల్లో చర్చనీయాంశం అయింది.

సమస్యల పరిష్కారానికి కృషిచేయాలి : ఎంపీపీ

కాశినాయన ఫిబ్రవరి28: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు కృషిచేయాలని ఎంపీపీ నల్లేరు పోలమ్మ పేర్కొన్నారు. బుధవారం నర్సాపురం వెలుగు కార్యాలయ సభాభవనంలో ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు తమతమ శాఖలకు సంబంధించిన నివేదికలను సభలో సభ్యులకు వివరించారు. ఈకార్యక్రమంలో తహసీల్దారు కృష్ణ, మండల ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య ఆచారి,ఇతర అధికారులు, ఎంపీటీసీలు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సీపీఎంకు విరాళాలు ఇచ్చి తోడ్పడాలి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 28 : ప్రజాసంక్షేమం కోసం పోరాటాలు చేసే సీపీఎం పార్టీకి ప్రజలు విరాళాలు ఇచ్చి తోడ్పడాలని మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన పోరుమామిళ్ల పట్టణంలో సీపీయం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సీపీఎం పార్టీని ప్రజలు ఆదరించాలని సీపీఎం కార్యదర్శి యేసుదాసు విజ్ఞప్తి చేశారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలో దుకాణాల వద్ద సీపీఎం పార్టీకి విరాళాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం పెరుగుతున్న ధరలతో తరుగుతున్న ఆదాయాలతో నిరుద్యోగులు, సామాన్యులు సతమతం అవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దాసరి విజయ్, దివాకర్, వినయ్‌కుమార్, శ్రీమాన్, బాష, చిన్నోడు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ప్రజాపోరు

చాపాడు, ఫిబ్రవరి 28: మండలంలోని అన్నవరం,మదూరు, చెండ్లూరు, చిన్నవరదాయపల్లె గ్రామాల్లో బీజేపీ నాయకులు బుధవారం ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. మైదుకూరు బీజేపీ ఇన్‌చార్జి మాచనూరు సుబ్బరాయుడు, మండల బీజేపీ అధ్యక్షుడు బొగ్గుల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలపై ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపాల్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరణ మేనిఫెస్టోలో పెట్టాలి

మైదుకూరు, ఫిబ్రవరి 28 : ఉపాధ్యాయ, ఉద్యోగుల కోసం పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని త్వరలో టీడీపీ ప్రకటించే మేనిఫెస్టోలో పెట్టాలంటూ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వై.రవి కుమార్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్‌కు వినతి పత్రం అందచేశారు. 30 శాతం ఐఆర్, ఆర్థిక బకాయిలు మెరుగైన పీఆర్సీతో పాటు పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. నాయకులు రాము, గంగులయ్య, తదితరులున్నారు.

నీటి సమస్యను పరిష్కరించాలి

కొండాపురం, ఫిబ్రవరి 28: ముచ్చుమర్రి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, రైతుసంఘం మండల ప్రధాన కార్యదర్శి వైవి.సుదర్శన్‌రెడ్డి కోరారు. ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ స్కూల్, పోలీస్‌స్టేషన్‌లతో పాటు పునరావాస కాలనీలలో పలు చోట్ల నీళ్లు లేక అవస్థలు పడుతున్నారన్నారు.ఈ మేరకు బుధవారం ఎంపీడీవో నాగప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

సెమిస్టర్ ఫలితాల్లో ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 28 : వైవీ యూనివర్సిటీ విడుదల చేసిన సెమిస్టర్ ఫలితాల్లో ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభకనబరిచారని ప్రిన్సిపాల్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. తృతీయ సంవత్సరం బయోటెక్నాలజీ విద్యార్థులు శాంతకుమారి, కవిత, నఫియా, ఎంఎస్‌సీఎస్‌లో సుహాబి, ఎంపీసీఎస్‌లో యాస్మిన్, ఆశాజ్యోతి మంచి మార్కులు సాధించారు. మూడో సంవత్సరం బీకాం కంప్యూటర్స్‌లో స్టెల్లా, రాణి, శిరీష, పల్లవి, మహేంద్ర, తేజకుమారి, శ్రీవిద్య, శ్రీవల్లి, పావని, బీఏలో బ్రహ్మయ్య, చిన్న ఓబులేసు, శివకుమారి ఉత్తమ జీపీఏ సాధించారు. ఆ విద్యార్థులను కరస్పాండెంట్ నంద్యాల కొండారెడ్డి, సీఈఓ మీనా కొండారెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



నమూనా ప్రాజెక్టును వివరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 28 : వసంతపేటలోని సరోజిని హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నమూనా ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయురాలు శివకుమారిని పాఠశాల చైర్మన్ జయచంద్రారెడ్డి అభినందించారు.

చంద్రబాబును కలిసిన బొజ్జ రోశన్న, రితీష్‌కుమార్‌రెడ్డి



బద్వేలు టౌన్, ఫిబ్రవరి 28 : చంద్రబాబును బద్వేలు నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జ రోశన్న, టీడీపీ యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి బుధవారం విజయవాడలో చంద్రబాబు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బద్వేలులో పరిస్థితిని చర్చించారు.

కూనవారిపల్లెలో ఘనంగా గంగమ్మ ప్రతిష్ఠ



అమ్మవారికి చీరెలు అందిస్తున్న మహిళలు

ఖాజీపేట, ఫిబ్రవరి 28: మండల పరిధిలోని కూనవారిపల్లెలో ఘనంగా గంగమ్మ ప్రతిష్ఠ నిర్వహించారు. బుధవారం కూనవారిపల్లెలో దాదాపు 95 సంవత్సరాల క్రితం నిర్మించిన గంగమ్మ రోడ్డుకు తగ్గు భాగంలో ఉండడంతో ఊరికి మంచిది కాదని గ్రామస్థులంతా బుధవారం పూజా కార్యక్రమాలు చేసి తొలించి మధ్యాహ్నం అదే స్థలంలో తిరిగి ప్రతిష్ఠ చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

● **నాణేలు లభ్యం..:** గ్రామంలో గంగమ్మ తల్లి తక్కువ ఎక్కువ ఎత్తులో ఉందని తిరిగి ప్రతిష్ఠించడంలో గంగమ్మను వేదమంత్రాలతో తొలగించేటప్పుడు అమ్మవారి కింద వంద సంవత్సరాల క్రితం నాణేలు లభ్యమయ్యాయి. వాటిని చూసి భక్తులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇప్పటికీ ఆ నాణేలు చెక్కు చెదరలేదు. ఆ నాణేలు తిరిగి మరలా అక్కడే ఏర్పాటు చేసి కొత్త నాణేలు కూడా వేసి ప్రతిష్ఠించారు.

వైభవంగా కళాకర్షణ బాలాలయ దారుబింబ విగ్రహ ప్రతిష్ఠ

రాజుపాలెం, ఫిబ్రవరి 28 : మండల పరిధిలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో సంజీవరాయ స్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా స్వయంభు మూలవిరాట్ విగ్రహం కదల్చకుండా పంచ రాత్రా ఆగమోక్తంగా యజ్ఞ యాగాది కలశ ప్రతిష్ఠ శ్రీస్వామి వారి కళాకర్షణ బాలాలయ దారుబింబ విగ్రహ ప్రతిష్ఠను బుధవారం ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి, కిరణ్‌రెడ్డి, ఎంపీపీ నారాయణరెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠలో దేవదాయశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ మల్టీజోన్-2 తిరుపతి వారు ఎస్వీఎన్ మూర్తి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షురాలు సలోని,జడ్పీటీసీ అంజనీకుమారి, ఆలయ ఈవో నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

జయదుర్గాదేవిగా పెద్దమ్మతల్లి



జయదుర్గాదేవి అలంకారంలో పెద్దమ్మతల్లి

మైదుకూరు, ఫిబ్రవరి 28 : పట్టణంలోని పాతూరులో వెలసిన పెద్దమ్మతల్లి 25వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం జయదుర్గాదేవి అలంకారంలో భక్తులకు పెద్దమ్మతల్లి దర్శనమిచ్చారు. పెద్దమ్మతల్లి యూత్ ఆధ్వర్యంలో ఈ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. మహిళలచే సామూహిక కుంకుమార్చనలు చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా చివరి రోజు గురువారం పెద్దమ్మతల్లి అలంకారంలో దర్శనమివ్వడంతో పాటు భక్తులకు భారీగా అన్నదానం చేయనున్నారు.

డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



ఆర్.అయేషా

మైదుకూరు, ఫిబ్రవరి 28 : యోగివేమన యూనివర్శిటి డిగ్రీ పరీక్ష ఫలితాల్లో యూనివర్సిటీ ప్రథమ ర్యాంకు మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని అయేషా సాధించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ నారాయణరెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. మూడో సెమిస్టర్‌కు బీఎస్సీ బీజెడ్సీ విద్యార్థినిని ఆర్ అయేషా 9.95 పాయింట్లు సాధించి మొదటి స్థానంలో నిలువగా, యస్ స్వరూప 9.73తో ద్వితీయ స్థానం పొందారని పేర్కొన్నారు. అలాగే 100శాతం విద్యార్థులు ఉత్తీర్ణత పొందారని, బీఎస్సీ ఎంపీ కంప్యూటర్ సైన్స్‌లో 9.12 గ్రేడింగ్‌తో వసంత్ సాధించారన్నారు. విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

పెద్దమ్మతల్లికి 75 వేలు విరాళం

మైదుకూరు, ఫిబ్రవరి 28 : పాతూరులో వెలసిన పెద్దమ్మతల్లి వార్షికోత్సవాల సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ 75 వేల రూపాయలను విరాళంగా నగదు అందచేశారు. 25వ వార్షికోత్సవాల సందర్భంగా ఆయన నిర్వాహకులకు 75 వేలు నగదును అందచేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పుట్టాను శాలువ కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులతో పాటు ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

ముద్దనూరు ఫిబ్రవరి28: స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని బుధవారం జిల్లా రిజిస్ట్రార్ పీవీఎస్.బాబు తనిఖీ చేశారు. సాధారణ తనిఖీలో భాగంగా విజిట్ చేసినట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా రిజిస్టర్ చేసిన వాటిని సిబ్బంది పరిశీలించారు.అయితే వారం రోజుల క్రితం చిన్నదుద్యాల గ్రామానికి చెంది న ఓ వ్యక్తి మార్ఫింగ్ ఆధార్‌తో అక్రమంగా భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న దానిపై విచారించినట్లు తెలిసింది.

వేద పాఠశాల ప్రారంభం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 28 : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన వేద పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రారంభించారు. బుధవారం ఆలయం అభివృద్ధిలో భాగంగా రూ.60లక్షల దేవదాయశాఖ నిధులతో నిర్మించిన శైవాగమ వేద పాఠశాల భవనం, రూ.16.50 లక్షలతో నిర్మించిన వాహనశాలను, రూ.13లక్షలతో నిర్మించిన గోకులంను ప్రారంభించారు. దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ పి.గురుప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఈఓ శంకర్ బాలాజీ, ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి,రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలోకి 50 కుటుంబాలు చేరిక



పుట్టా సమక్షంలో టీడీపీలో చేరిన పాటిమీదపల్లె గ్రామస్థులు

ఖాజీపేట, ఫిబ్రవరి 28: రాష్ట్రంలో వ్యవస్థలను భ్రష్టు పట్టించిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. బుధవారం పాటిమీదపల్లెలో రాచమల్ల సుబ్బరాయుడు, దుగ్గిరెడ్డి లక్ష్మీరెడ్డి, బచ్చల నాగశివ, కనమల నాగరాజు అనుచర వర్గం దాదాపు 50 కుటుంబాలు టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, రాము, బాలకృష్ణయాదవ్, రవి, మండల నాయకులు వెంకటసుబ్బయ్య, జెండాల మాబాష, సిద్దారం కదిరుల్లా, ఫరూక్, జిలానీ, వెంకటసుబ్బయ్య, భాస్కర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, హరినాథరెడ్డి, పాపాన మల్లికార్జునరెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, నాగశివారెడ్డి, బాల కొండారెడ్డి, పూలసుల్తాన్, సుబ్బయ్య, నాగార్జునయాదవ్, రమణ, పల్లె గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

'నందం సుబ్బయ్యను చంపలేదని బంగారురెడ్డితో ప్రమాణం చేయించగలరా'..?



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు ఖలీల్ తదితరులు

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 28 : ప్రొద్దుటూరులో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బీసీ నేత నందం సుబ్బయ్యను ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి బావమరిది బంగారు రెడ్డి నరికి చంపలేదని అదే చౌడమ్మ మీద ప్రమాణం చేయించగలరా అని టీడీపీ నాయకుడు ఖలీల్ విమర్శించారు. బుధవారం అన్నాక్యాంటీన్‌లో డాక్టర్‌గౌస్, డాక్టర్ ఆజాద్, ఎర్రబల్లి దాదాపీర్‌లతో కలిసి ఖలీల్ మాట్లాడుతూ ముక్తియార్ దౌర్జన్యం చేయలేదని ఖురాన్ మీద ప్రమాణం చేస్తే ఊరువొదిలి వెళతానని ఎమ్మెల్యే రాచమల్లు చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నామన్నారు. అలాగే సురేష్ నాయుడు, లింగారెడ్డి, ముక్తియార్‌లపై తప్పుడు కేసులు పెట్టించలేదని ఎమ్మెల్యే రాచమల్లు ప్రమాణం చేస్తే మేము దౌర్జన్యం చేయలేదని ఖురాన్ మీద ప్రమాణం చేస్తామన్నారు. ఎఫ్ఐఆర్‌లోని ప్రతి తప్పుడు ఆరోపణలమీద మేము ప్రమాణం చేస్తామని ఎమ్మెల్యే అలాగైతే చాలా వాటికి ప్రమాణాలు చేయాల్సివస్తుందన్నారు. ముఖ్యంగా మున్సిపల్ వైస్‌చైర్మెన్ ఆయిల్ మిల్ ఖాజా, కౌన్సిలర్ ఇర్ఫాన్‌ను కౌన్సిల్ సమావేశంలోనే చెప్పులతో కొడితే అక్కడే వున్న బంగారురెడ్డి దీన్నంతా నడిపి ఇద్దరు వైసీపీ ముస్లింల మధ్య గలాటా పెట్టి చోద్యం చూడలేదని బంగారురెడ్డి ప్రమాణం చేయగలడా అన్నారు. ఇదే వైస్ చైర్మెన్ ఆయిల్ మిల్ ఖాజా మీ వైసీపీ కౌన్సిలర్ కంకరగౌస్‌పై హత్యాయత్నం చేసినప్పుడు అప్పుడు ఇస్లాం అంటే శాంతి అని ముస్లిం అంటే ప్రేమ అని ఎమ్మెల్యేకు గుర్తుకు రాలేదా అన్నారు. ఆనాడు వారికి ఈ సూక్తులు చెప్పలేదన్నారు. వారిమధ్య ఆజ్యం పోసి ముస్లింల మధ్య తగాదాలు పెట్టింది మీరు కాదని ప్రమాణం చేయగలరాఅన్నారు. అలాగే ఆటోనగర్ అధ్యక్షుడు నన్నే సాహెబ్ ఆటో నగర్ డబ్బులు 1.5 కోట్లు ఎమ్మెల్యేకు తెచ్చిఇచ్చాడని ఆరోపిస్తున్నాం ఇది వాస్తవం కాదని ప్రమాణం చేయండి అని సవాల్ విసిరారు.

సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 28 : యోగివేమన యూనివర్శిటీ విడుదల చేసిన 3, 5 సెమిస్టర్ ఫలితాల్లో లేపాక్షి డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి తెలిపారు. మూడో సెమిస్టర్ ఎంసీఎస్‌లో భారతి లక్ష్మి 9.57, నజియా 9.09 జీపీఏ సాధించారు. ఎంపీసీఎస్‌లో తేజస్విని 8.98, వెంకటేభార్గవి 8.52, బీకాం కంప్యూటర్స్‌లో ముస్కాన్ 8.93, చంద్రకళ 8.61 జీపీఏ సాధించారు. ఐదో సెమిస్టర్ ఎంపీసీఎస్‌లో భవ్యశ్రీ 9.28, నవీన్‌సింహా 8.54, ఎంపీసీఎస్‌లో వెంకటశ్రీవైష్ణవి 9.07, భారతి 8.78, బీకాం కంప్యూటర్స్‌లో ఆసిఫ్ 8.69, లలిత 8.28 జీపీఏ సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ రాఘవరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఆర్‌టీడీ కళాశాల విద్యార్థుల విజయకేతనం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 28 :వైవీ యూనివర్సిటీ సెమిస్టర్ ఫలితాల్లో రాణి తిరుమలదేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభకనబరిచారని ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 5వ సెమిస్టర్‌లో మహబూబ్‌చాన్ 9.57, భావన 9.56, హారతి 9.04 జీపీఏ సాధించారు. ఎంఎస్‌సీఎస్‌లో నౌరిన్‌తాజ్ 9.56, తజ్‌కియ ఖనం 8.95, బీకాం కంప్యూటర్స్ అప్లికేషన్స్‌లో సుకన్య 8.64, మిస్బా అంజు 8.62, జగదీశ్వరరెడ్డి 8.52 జీపీఏ సాధించారు. మూడో సెమిస్టర్‌లో బూస్రాఫిరదౌస్ 9.28, స్రవంతి 9.12, ఎంసీఎస్‌లో యశ్వస్విని 8.9, హబీబుల్లా 8.3, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌లో రుబినా 8.58, సుగుణ కుమారి 8.34 జీపీఏ సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ తరుణేందు శేఖర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు